
# మా అమ్మకు పెళ్ళికాలేదు

ఏ.వి. శేషారత్నం

రాష్ట్రస్థాయిబాలల చిత్రకళాప్రదర్శన జరుగుతోంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త సతీమణి మృణాళినీదేవి కాళ్ళు ఆ చిత్రం దగ్గర సంకెళ్ల వేసినట్టు ఆగిపోయాయి.





"అదొక చెత్తకుండీ. కుండీలో చెత్త నిండిపోయాక మిగిలిపోయిన కాగితాలు గుడ్డపీలికలు గాజు పెంకుముక్కలు చెల్లాచెదురుగా కుండీ చుట్టూ చెదర చెదరగా ఉన్నాయి. ప్రక్కనే రెంతుసం మురిక్కాలువ యమునా నదిలా పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తోంది.


చెత్తకుండీ ప్రక్కనే పడివున్న ఎంగిలాకుల మీద ఓ చిన్నమానవ ప్రాణి కదుల్తూ కొట్టుకుంటోంది. బొడ్డుతాడు చుట్టూ రక్తం మరకలు. ఈగలు దోమలు మహానందంగా ఆ చంటిబిడ్డమీద పడి విందు చేసుకుంటున్నాయి. ఉండీ ఉడిగీ క్యేర్ క్యేర్ మంటున్నట్టు చిన్నగా తెరచిన నోరు.

పుట్టగానే తల్లి ఒడి వెచ్చదనానికి దూరమైన ఆ పసిగుడ్డు ఈ పాపపు లోకాన్ని చూడడం ఇష్టం లేదన్నట్టు నిద్రపోతున్నట్టు కళ్ళుమూసుకునేవుంది." ఆ పసిముఖంలో - రంగుల కలయికతో కదిలించే కుంచె - అసహ్యాన్ని కొట్టొచ్చినట్టు చిత్రీకరించింది.

అదే చిత్రంలో దూరంగా చీకటిలో - బరువు దింపుకున్న నిశ్చింతలో భవిష్యత్తుకు సోపానాలు నిర్మించుకుంటూ వడిగా తలచుట్టూ కప్పుకున్న కొంగుతో ఓ పచ్చి బాలింత నడచి పోతోంది. చిత్రం పేరు 'మాతృప్రేమ -'

మరో చిత్రంలో అప్పుడే పుట్టిన పిల్లల్ని రక్షించుకుంటూ వాటిచుట్టూ గాభరాగా తిరుగుతున్న నల్లకుక్క కడుపులోని పచ్చి పేగులు తెగిపడేలా మొరుగుతోంది.

ఆ భావగర్భితమైన చిత్రాలు ఆమె కడుపులోని పేగుల్ని మెలితిప్పేసినంత బాధించాయి. ఎకసీ విరియని బాలల



వేసిన చిత్రమేనా ఇది?

'ఈ చిత్రాలు ఎవరివి?' అతి నెమ్మదిగా ప్రశ్నించిందామె.

"శివకుమార్ అని ఈ పదిహేనేళ్ళ బాబు వేసినవి మేడమ్! వయసుకు మించిన తెలివి తేటలున్నాయి."

శివకుమార్ ఆమెకు వినయంగా నమస్కరించాడు. ఒక్కక్షణం ఆ కుర్రాడిని చూడగానే విచిత్రమైన స్పందన కలిగింది మృణాళినీదేవిలో. వెంటనే సర్దుకుంటూ మృదువుగా అడిగింది.

'ఇంత చిన్న వయసులో ఇంతటి భావాన్ని ప్రస్ఫుటింపచేసే చిత్రాలు ఎలా వెయ్యగలిగావు?"

శివకుమార్ మృదువుగా నవ్వి - "మీ అభిమానం మేడమ్" అన్నాడు.

ఇంకా పసితనం పోని లేత చెక్కిళ్ళు చురుకైన కళ్ళు-ఆ కళ్ళలో ఏదో ఆర్తి, ఆవేదన - చెప్పలేని నిరాశ ద్యోతక మవుతున్నాయి.

"నువ్వేం చదువుతున్నావ్ బాబూ?"

చెప్పాడు.

"మీ అమ్మా నాన్న....?"

"మా అమ్మకు పెళ్ళి కాలేదు." - శివకుమార్ కంఠంలో రవంత కాఠిన్యం తొంగి చూసింది ఎందుకో-

గతుక్కుమందామె.

అక్కడున్న వాలంటీర్ సర్ది చెపుతున్నట్టుగా అన్నాడు.

"శివకుమార్ శ్రీకృష్ణ అనాథాశ్రమ బాలుడు మేడమ్. చదువులో, చిత్రలేఖనంలో అన్నింటా చాల చురుకైనవాడు. ఇతని 'కడుపుతీపి' చిత్రానికి ఆమధ్య ఫస్ట్ ప్రయిజ్ వచ్చింది. ఇదిగో ఆ చిత్రం కూడా ఇక్కడ ప్రదర్శిస్తున్నాం"

మృణాళినీదేవి చెవులు వింటున్నా మనస్సక్కడ లేదు. ఆమె కళ్ళు 'కడుపుతీపి" చిత్రాన్ని చూసి పాలిపోయినట్లయ్యాయి.

కుంతీకన్య బాలకర్ణుడిని తొట్టెలోపెట్టి నీళ్ళలో వదులుతున్న చిత్రమది.

శివకుమార్‌వైపు చూసిందామె. ఏదో చూస్తున్నాడు. మాతృప్రేమకు నోచుకోని అనాథ బాలుడి ఊహాచిత్రాన్ని తదేకంగా చూసి ముందుకు కదిలిందామె.

• • •


పరుపుమీద దొర్లుతున్న మృణాళినీదేవికి ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఆమె చెంపల మీదుగా కన్నీరు జారి దిండు తడిసిపోతోంది.

'మాతృప్రేమ' 'కడుపుతీపి' చిత్రాలు ఆమెను వెంటాడుతున్నాయి. అవి ఆమె జీవితపు అట్టడుగు పొరల్లోని ఏవో దృశ్యాలను వెలికి తీస్తున్నాయి.

జైన్ స్టేట్స్ వెళ్ళిపోయాడు. తిరిగి వస్తాడోరాడో-వచ్చాక తప్పకుండా పెళ్ళి చేసుకుందాం అన్నాడు. ఈ మూడేళ్ళ కాలం ఎన్ని మార్పుల్ని తెచ్చిపెడుతుందో? అతను అక్కడే ఎవర్నయినా పెళ్ళాడితే?

ప్రేమ గుడ్డిది అన్నారు. గుడ్డిగానే జైన్‌ను నమ్మింది. ఇంకా నమ్ముతూనే వుంది. ప్రకృతి సహజం - ఏమిటి ఆడది నమ్మడమా? అవసరం తీరేదాకా మగవాడు నమ్మించడమా?

పోనీ ఇప్పుడేమయింది? తనకాళ్ళ మీద తను నిలబడగలదు - మరి? కాని తండ్రి పరువు ప్రతిష్ఠలో? ఈ విషయం ప్రేమవ్యామోహంలో చిక్కుకున్న తన కింత



కాలం ఎందుకు గుర్తుకు రాలేదు? అది ప్రకృతి సహజం -

జైన్ స్టేట్స్‌నుంచి వచ్చేదాకా ఎదురు చూడాలి. అతను వచ్చాక కాదంటే?

అంత అభిమానం లేని ఆడది కాదు తను - అతన్ని దెబ్బకొట్టేలా మరో బిగ్ షాట్‌ను పెళ్ళాడుతుంది.

కాని?

సహజ ప్రకృతి- ప్రకృతి సహజంగా తన కడుపులో ఏదో కదలిక-తన గుండె స్పీడుగా కొట్టుకుంది. తన అనుమానం నిజమయితే?

నిజమయింది. తను తల్లి కాబోతోంది. అంతవరకు అనుకున్నవన్నీ మరచి జైన్‌కు - ఎన్నో వేలమైళ్ళ దూరాన వున్న జైన్‌కు అనుమానిస్తూనే లెటర్ వ్రాసింది.

అనుమానం నిజమే - జైన్‌నుంచి ఉత్తరం రాలేదు. ఇకముందు రాదుకూడ. ఆ ఎదురు చూడటంలో ఆలస్యమయింది.

నెత్తీనోరు కొట్టుకుంటూనే తల్లీదండ్రీ 'ఆరోగ్యం' నెపంతో దూరప్రాంతానికి తీసుకుపోయారు. తొమ్మిది నెలల పాప భారం భూమ్మీద పడింది.

కళ్ళు విప్పేసరికి కన్నబిడ్డ కనిపించలేదు. 'ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంచారు' అన్నాడు తండ్రి.


కన్నబిడ్డమీద మమకారం పొంగులెత్తుతోంది. ఇంకా నెల్లాళ్ళదాకా బిడ్డను చూపించరట. శూన్యదృక్కులతో నర్సింగ్‌హోం విండోనుంచి చూస్తున్న తన కంటిముందొక హృదయవిదారక దృశ్యం.

చెత్తకుండీ చుట్టూ ఉన్న ఎంగిలాకుల మీద ఒక పసిబిడ్డ దిక్కులు పిక్కటిల్లేలా ఏడుస్తోంది.

తన మనసు కలుక్కుమంది.

*చెదలు పట్టిన మానవత్వాన్ని*
*చూడలేక సూర్యుడు మబ్బుల*
*చాటున*
*మొహం దాచుకుంటున్నాడు -*
*గాఢంగా నిట్టూర్చింది చెత్తకుండీ-*
*తనకీ పాపపు లోకంనుంచి త్వరగా*
*విముక్తి కలిగించమని అర్థిస్తు*
*న్నట్టు*
*అరవిచ్చుకున్న కళ్ళ మీద బుల్లి*
*చేతులు-*

పాలపాకెట్లు తెస్తున్న పల్ల కాబోలు కెవ్వున అరచి విసురుగా పరిగెత్తింది.




అంతే పది నిమిషాల్లో పెద్ద గుంపు పోగయింది.

'ఏ పాపిష్టి దానికి ఒళ్ళుకొవ్వెక్కిందో'

'అంత ఇష్టం లేనిది ఏ అబార్షనో చేయించుకోక బిడ్డను కనడం దేనికో -'

'ఏ అనాథ శరణాలయంలోనో వదిలేసి పోకపోవచ్చుగా -'

"ఈ కాలం పిల్లలు పెళ్ళికి ముందే 'స్వేచ్ఛ' అంటూ బరితెగించి పోతున్నారు. నిన్ను గాఢంగా ప్రేమించానన్న మగాడు పెళ్ళి ప్రసక్తి వచ్చేసరికి ఉడాయించి వుంటాడు. ఆడపిల్ల ఏంచేస్తుంది? భవిష్యత్తు పాడు చేసుకోలేక ఇటు బిడ్డను వదలలేక ఎంత బాధ పడిందో -"

'ఆ బాధా గాడిద గడ్డా - బిడ్డను కన్న మహాతల్లిని నా ఇంటి ముంగిలే - ఈ చెత్తకుండీయే కావల్సి వచ్చిందా పాపిష్టిది,'

'ఇంకా పసి బిడ్డ బ్రతకదులెండి, మురికాల్వ ప్రక్కన ఎన్ని గంటల నుంచి పడివున్నాడో.'

'ప్రాణం ఉందేమోచూసి ఏ అనాథ శరణాలయానికో అప్పగిస్తేనో,'

'ఆ ఎవరికొచ్చిన లంపటం? ఈ మధ్య ఇలాంటి కేసు లెక్కువయి వాళ్ళకి విసుగెత్తినట్టుంది. పుణ్యానికి పోతే పాప మెదురయిందని మొన్నొకాయన ఇలాగే రైల్లో దొరికిన పిల్లను అప్పగించిపోతే ఈ పిల్ల నీ కూతురు కాదని ఋజువేమిటి అన్నారట -' నానా అవస్థా పడ్డాడా పెద్ద మనిషి.'

'నేనే అప్పగిద్దును. కాని నాయింట్లో పెళ్ళి కావలసిన ముగ్గురు ఆడపిల్లలున్నారని -'


"జాతి బొమ్మలా ఉన్నాడు బిడ్డ. మీకు పిల్లల్లేరుగా అమ్మగారూ పెంచుకోకూడదు?"

"పెంచుకోడానికి ఈ పాపపుముద్దే కావాలా? నువ్వు మళ్ళీ పనిలో కొచ్చావంటే కాళ్ళు విరగ్గొడతాను."

తన మనసు కకావికలయిపోయింది. మరీ అంత నిర్దాక్షిణ్యంగా ఆ తల్లి అలా చెత్తకుండీకి బిడ్డను బలి ఇవ్వడం చూసి అపుకోలేని కోపం వచ్చింది. తనేవెళ్ళి ...ఎందుకో ఆగిపోయాయి తనకాళ్ళు.

ఎనిమిది దాటుతున్నా జనం చెల్లాచెదురయి పోతున్నారు తప్ప ఒక్కరూ ఆ బిడను తీసుకోలేదు. ఆ బొందిలో






ప్రాణం లేనట్టు కదలిక ఆగిపోయింది. కళ్ళుతెరవని పసిగుడ్డు కళ్ళచుట్టూ - పొడుస్తుంటూ దోమలు, ఈగలు.

తన కళ్ళవెంబడి నీళ్ళు ధారాపాతంగా కారిపోతున్నాయి. చూడలేక మంచంమీద వాలిపోయింది. మరో గంట పోయాక తండ్రి కంగారు పడుతూ వచ్చి త్వరగా ప్రయాణం కమ్మన్నాడు.

'మరి బాబు' తన గొంతులో ఆత్రం

తల్లి తల వంచుకుంది. 'బాబుకి ఇన్ఫెక్షన్ వచ్చిందమ్మా! డాక్టర్ శాయశక్తులా ప్రయత్నించారు. కాని ఫలితం లేకపోయింది.'

బావురుమంది తను.

'పెంటమీద సంటోడిని లెక్కల పంతులమ్మ తీసికెళ్ళిందంట. ఆ శాంతమ్మకి పెళ్ళి కాలేదుగదా ఈ బిడ్డనేంచేసుకుంటుందో' - తన మనసు అంత బాధ లోనూ రవంత శాంతించింది. లోకంలో మానవత్వం ఇంకా గొడ్డుపోలేదన్నమాట.

కానీ నెల్లాళ్ళ తర్వాత పాపం బద్దలయింది. తల్లిదండ్రీ దెబ్బలాటలో తన గుండె పగిలే రహస్యం బయట పడింది.

ఆనాడు చెత్తకుండీ దగ్గర జనం అన్న మాటలన్నీ సూదిగా బాణాల్లా తన గుండెలకు నాటుకున్నాయి. వాళ్ళంతా శపిస్తున్నట్టు, ఆ శాపాగ్నిలో తను కాలిపోతున్నట్టు -

పసిబిడ్డ అనికూడ చూడకుండా తన కన్నకూతురు భవిష్యత్తుకోసం తల్లిదండ్రీ తన బిడ్డ భవిష్యత్తుని నాశనం చేసారు.


తల్లిదండ్రికి తెలియకుండా శాంత లెక్కల టీచర్ అన్న పేరుతో ఆ సుదూర ప్రాంతంలోని అన్ని హైస్కూల్స్ కీ ఉత్తరాలు వ్రాసింది. కానీ జవాబులేదు.

ఇంట్లో తానొక విధంగా బందీగా బ్రతికింది.

విధి ఎంత చిత్రమైనదో-మూడేళ్ళలో ఎన్ని మార్పులో! తిరిగి వచ్చిన జైన్ తనని పెళ్ళిచేసుకున్నాడు. తను ఊళ్ళో లేని తొమ్మిది నెలల్లో ఎన్నో ఉత్తరాలు వ్రాసాడట. ఏదీ తనకందనే లేదు. కాదు అందనిచ్చి ఉండరు.

కానీ జైన్ అంత పెద్ద హోదాతో తిరిగివచ్చి తనను పెళ్ళి చేసుకుంటానంటే తండ్రి కాదనలేదు.

పెళ్ళికిముందు తనని నోరు విప్పనీయ లేదు తల్లిదండ్రీ. పెళ్ళయ్యాక బావురు




పస్తు తనని జైన్ ఓదార్చాడు.

“అదొక పీడకల అనుకో మృణాళినీ! నీ ఉత్తరం నాకు చేరివుంటే ఇంత జరగక పోను. బాబు చనిపోయివుంటాడు. నీకా విషయం తెలియజేయడం ఇష్టంలేక శాంతగారు వ్రాసి ఉండరు. పోనీ – జరిగిందేదో జరిగింది. మనకి బిడ్డలే పుట్టకపోతారా ?”

కానీ చెత్తకుండీ ప్రక్కన దారుణ హింస పడిన పసిబిడ్డ శాపం – తనకి తగిలింది. తన కడుపు పండలేదు. మాతృత్వానికి శాపం –

ఎన్నో అనాధాశ్రమాలకి విరాళా లిచ్చింది. విద్యా సంస్థలకి ప్రదానం అతి గౌరవ సూచకంగా తన చేతుల మీదే జరుగుతుంది. కానీ –

శివకుమార్ కళ్ళముందు మెదిలాడు. అతని కళ్ళలో ఆ కోపం, నిర్వేదం, నిరాశ – ఆవేదన ? ఆ చిత్రాల్లో ఒక రకమైన కసి, ఆర్తి –

అతడే తన బాబు అయితే ? తన బాబు అనాధాశ్రమానికెందుకు వెళ్తాడు ? శాంతాదేవి పెంచలేక ఇచ్చేసిందా ? పెళ్ళికాని తల్లిగా చిరకాలం బ్రతకడానికెవరు ఇష్టపడతారు ?

ఒకసారి శ్రీకృష్ణ అనాధాశ్రమానికి వెళ్తే ?

• * •

అధునాతనమైన కారు శ్రీకృష్ణ అనాధాశ్రమం ముందాగింది. పిల్లలు బిలబిల మూగారు. మృణాళినీదేవి జైన్ ఆశ్రమాధికారి ముందు నిలిచారు.

దాదాపు ఒక గంట తర్వాత – శివకుమార్ ఆశ్రమాధికారిచే పిలిపించబడ్డాడు. మృణాళినీ దేవివైపు కళ్ళెత్తి చూసాడు.

ఆమెకళ్ళు నిర్జీవంగా ఉన్నాయి. ప్రపంచంలోని దైన్యమంతా ఆమెలో మూర్తీభవించి వుంది. ఏక్షణాన్నయినా ఆమె అతడిని చేతులుచాచి గుండెల్లో దాచుకోవాలనేలా వుంది.

“శివా ! నువ్వు చాల అదృష్టవంతుడివి. అమ్మకోసం నీ నిరీక్షణ ఫలించింది. వీరు నీ కన్న తల్లిదండ్రులు. నిన్ను పెంచుకుంటారు. ఇక మీదట నువ్వు వీళ్ళ దగ్గరే ఉండొచ్చు”

‘బాబూ ! శివా !’ యుగయుగాల మాతృమూర్తి పిలుపు అది. కాని శివ



**అందమైన చిరునామా**

హైద్రాబాద్‌లోని ఓ మల్టీస్టోరేడ్ భవంతి గోడ మీద ఇలారాసి ఉంది.

“ఎనిమిదో అంతస్తులో బట్టాకేసే అందమయిని అమ్మాయి పేరు రాధిక. ఇంకా పెళ్ళి కాలేదు”

కుమార్ అంగుళంకూడ కదల్లేదు.

“కాని మా అమ్మ శానిటోరియంలో కేన్సర్‌తో చనిపోయిందికదూసర్ !”

“శాంతగారు నిన్ను పెంచిన తల్లే. చనిపోయేముందు నీ వివరాలు మాకుఇచ్చి నిన్ను ఆశ్రమానికి అప్పజెప్పారు. అవన్నీ అమ్మగారు చెప్తారులే శివా !”

శివకుమార్ మృణాళినీదేవివైపు తీక్షణంగా చూసాడు. అది గ్రహించిన జైన్ సానునయంగా అన్నాడు.

“పరిస్థితుల ప్రభావంవల్ల అనాధవయ్యావుగానీ నువ్వు...”

“ఆగండిసర్. మీరిప్పుడు నన్ను పెంచుకోడానికి తీసుకెళ్తున్నారా లేక కన్న కొడుకుగా లోకానికి పరిచయం చేస్తారా ?”

‘శివా ! ఏమిటామాటలు?’ ఆశ్రమాధికారి కంగారుగా అన్నాడు.

“అదికాదుబాబూ !...” మృణాళినీ దేవి, జైన్ ఒకేసారి అన్నారు.

“ఏదికాదు. మీకుబిడ్డల్లేని కారణంగా ఒక అనాధ బాలుడిని మీరు పెంచుకుని లోకం చేత జేజేలు చెప్పించుకుందామను కుంటున్నారు. అంతేగాని పదహారేళ్ళ క్రితం మీరు పాపపు మూటగా నన్ను పారేయడం...ఆ చరిత్ర అంతా చెప్పుకోలేరు. ఎందుకు? మీరు సంఘంలో పరువు ప్రతిష్టలున్నవారు కనుక.”

ఒక్క అడుగు ముందుకు వెయ్యబోయింది మృణాళినీదేవి. “ఆగండమ్మా” ఈసారి శివ కంఠం స్థిరంగా ఉంది అజ్ఞాపిస్తున్నట్టు.

“ఒకనాడు నన్ను కనేందుకు మీకు పరువు అడ్డం వచ్చింది. ఈనాడు కన్న బిడ్డగా చెప్పుకునేందుకూ అదే పరువు అడ్డుపడుతుంది. క్షమించండి మీ కారు ఆగగానే నేనిరూందగ్గర కొచ్చాను. మీ మాటలన్నీ విన్నాను. చెత్తకుండీ దగ్గర పడివున్న నా ప్రాణం కాపాడేందుకు శాంతాదేవి తన పరువును ప్రక్కకు నెట్టింది. మానవత్వం కోసం తన ప్రతిష్టను ధారపోసింది. నా భవిష్యత్తుకోసం తన పెళ్ళిని త్యాగం చేసింది. ‘నాన్న ఎవరమ్మా’ అన్న నా తెలిసీ తెలియని ప్రశ్నకు, తను నిలువునా కృంగిపోయింది. లోకం చేత ‘పతిత’ అన్న ముద్రవేయించుకుంది. క్షమించండమ్మా ! నేను మీవెంట రాలేను. మా అమ్మకు పెళ్ళి కాలేదు. నాకంతవరకే జ్ఞాపకం. ఏస్వార్థం లేని ఆమె మా అమ్మ. శాంతాదేవి మా అమ్మ అని చాలా గర్వంగా చెప్పుకుంటాను” – ధీమాగా తలెత్తి నడచిపోతున్న శివకుమార్‌లో వెయ్యిమంది కర్ణులు కనిపించారు మృణాళినీ దేవికి. కుంతీదేవి అంత నిబ్బరంలేని ఆమె మరుక్షణం కుప్పగా కూలిపోయింది. •••